క్లుప్తంగా

నేటి నుంచి గడప గడపకు కార్యక్రమం

సంబేపల్లె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి 3వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 7 గంటల వరకు మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి 31, 01 వ తేదీలలో గురిగింజకుంట, 02, 03వ తేదీలలో గుట్టపల్లెలలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలలో కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ గురువారం తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని మినమరెడ్డిగారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారంతో ఎస్ఐ, తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేక ఆడుతున్న ఆరుగురితో పాటు రూ. 9800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

నందలూరు(రాజంపేట) : నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని వైద్యాధికారిణి సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మండల పరిషత్ సభా భవనంలో జరుగుతుందని వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖపరమైన అంశాలు, ఆసుపత్రి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు.

ఘనంగా ద్రౌపది కల్యాణం



ద్రౌపది కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె సత్రం వద్ద జరుగుతున్న మహాభారత మహోత్సవంలో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖ భాగవతారిణి శారదచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం కొనసాగుతోంది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాలిమేర రెడ్డి సిద్దారెడ్డి, స్వాతి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ రెడ్డప్ప, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి

రామాపురం : తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ రెడ్డిబాషా, సబ్ పోస్ట్‌మాస్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉప తపాలా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలో సబ్ పోస్టాఫీసు లేకపోవడంతో ప్రజలు తపాలా శాఖ సేవలకు దూరంగా ఉన్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పోస్ట్ ఆఫీస్‌లో సేవింగ్ ఖాతాలు, ఎస్ఎస్ఏలు, ఆర్‌డీలు, డిపాజిట్లు చేసుకోవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది గోపినాయక్, కృష్ణనాయక్, ఆంజనేయులు, రియాజ్ అహ్మద్, సురేష్, నాగభూషణ్‌రెడ్డి, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రాజంపేట : సీఎం సహాయ నిధి పేదలకు వరమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం మేడా భవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొండయ్యగారి గుండాలయ్యకు రూ1,30,000, షేక్ షేహన బేగంకు రూ.65వేలు, కల్లూరి రోశయ్య రూ.60వేలు, షేక కరీముల్లా రూ.26వేలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గండికోట గుల్జార్‌బాషా, జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, కౌన్సిలర్ నవీన్, వడ్డే శ్రీను, నాయకులు మురళిగౌడ్ పాల్గొన్నారు.

సత్కారం

చిట్వేలి : విశ్రాంత ఉపాధ్యాయుడు గంగరాజు లక్ష్మిమోహన్ పది పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ సభ్యులు, అడ్వైజర్ బోర్డు మెంబర్ రంగారెడ్డి, నూకా శ్రీనివాసులు రెడ్డి, జానీ, లక్ష్మీనారాయణలు ఆయనను సత్కరించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

బి.కొత్తకోట : ఎస్సీల వర్గీకరణకు బీజేపీ మాటిచ్చి మోసం చేసిందని, దీనికి నిరసనగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గురువారం మహాజన సోషలిస్టు పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ము చిన్నా తెలిపారు.

రాజంపేట: సీతారాముల కల్యాణం జరుపుతున్న వేదపండితులు



గాలివీడు: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



రాజంపేట: నూనివారిపల్లెలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సిద్దవటం: కల్యాణోత్సవానికి హాజరైన కమాండెంట్ శ్రీనివాసరావు



వైభవం.. రాములోరి కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్న గ్రామాలు
- ఉత్సాహంగా ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం



రామాపురం: సీతారామకల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో రాములోరి సందడి కనిపించింది. అనేక ప్రాంతాల్లో తొలిరోజే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కనులారా తిలకించి తరించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో నవమి వేడుకల సందడి అధికంగా కనిపించింది. వయోబేధం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు కలసిమెలసి వేడుకలను నిర్వహించారు. పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. మరో ఎనిమిది రోజుల పాటు నవమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. చివరి రోజు అనేక ప్రాంతాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి గ్రామోత్సవ కార్యక్రమాలను చేపట్టనున్నారు.

వైభవంగా ఉత్సవాలు

రాజంపేట రూరల్ : శ్రీరామచంద్రమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని 11రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు గురువారం గ్రామగ్రామాన వైభవంగా శ్రీకారం చుట్టారు. ఊరూరా నిర్వహించుకుంటున్న ఈ వేడుకలలో గ్రామాలలోని శ్రీ కోదండరామాలయాలను సుందరంగా అలంకరించారు. మూల విరాట్‌లను పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచే కోదండరామాలయాల వద్ద భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో పూజలు వేడుకగా నిర్వహించుకోవడంతో గ్రామాలలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వేడుకల అనంతరం శ్రీరామచంద్రమూర్తికి అత్యంత ప్రీతికరమైన పానకం, వడపప్పు, కొబ్బెరలను వితరణ చేశారు.

భువనగిరిపల్లెలో రామాలయంలో మొదటి రోజు శ్రీరామచంద్రమూర్తి, సీతా, లక్ష్మణ అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం నుంచి వేడుకలు నిర్వహించుకొని స్వామి వారికి పూజలు చేశారు. నూనివారిపల్లిలోని శ్రీకోదండరామ స్వామి ఆలయం వద్ద గురువారం ఎంవీ రమణ కుటుంబసభ్యులు శ్రీ సీతారాములకు కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. వేద మంత్రాలతో వేద పండితులు పూజలు చేస్తూ నిర్వహించిన కల్యాణ వేడుకలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల పరిధిలోని పలు గ్రామాలలోని రామాలయాలలో శ్రీరామనవమి పండుగను గురువారం ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల వద్ద విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీరబల్లిలోని గడికోట గ్రామం, ఎడబల్లిలో ఏపీఎస్పీడీసీఎల్ ఏపీ చైర్మన్ సివి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిపించారు. మహోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ యువనాయకుడు, ఎస్ఆర్ఐ మదన్ రెడ్డి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పలుశాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఎదురుగా వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో గురువారం శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సీతారాముల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు, ఆయన సతీమణి భాగ్యలత తిలకించారు. అనంతరం వచ్చిన భక్తులకు కమాండెంటు శ్రీనివాసరావు, అసిస్టెంటు కమాండెంట్లు కె.వెంకటరెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్‌లు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం జరిగింది.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : శ్రీరామనవమి సందర్భంగా గురువారం మండలంలోని ఎగువకుమ్మరిపల్లెలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు. వేదపండితుడు బండాత్మకూరు శివస్వామి ఆధ్వర్యంలో కల్యాణతంతు కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణంలో యెద్దల సుబ్బరాయుడు, ఎసర్పంచి మోహన్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచి శివప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తాటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం సకల శుభములకు సోపానం

రామాపురం : సీతారాముల కల్యాణం సకల శుభములకు సోపానమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లె, హసనాపురం, చిట్లూరు గ్రామాల సరిహద్దులోని ఆలయంలో రోటరీ క్లబ్ డా. కె.వి.ఎస్. నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కరుణా, కటాక్షాలతో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పడిగెల శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణప్ప విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజులురెడ్డి, మాజీ సర్పంచ్ మురళీ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శివ, బండపల్లె సుబ్బయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం వాడవాడల శ్రీరామనవమి ఉత్సవాలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు, ప్రజలు ఆలయాల్లో వెళ్లి భక్తిశ్రద్ధలతో దేవుడిని పూజలు చేశారు. ఎర్రమరెడ్డిగారిపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం బండపల్లె టోల్‌గేట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ ఉత్సవాలకు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

రాయచోటి టౌన్ : పట్టణంలోని రామాలయాలలో శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా రాయచోటి పట్టణంలోని శ్రీ రామాలయాలలో మొదటి రోజు శ్రీ రామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జగదాంబ సెంటరలోని రామాలయం, రెడ్డీస్ కాలనీలోని శ్రీ సీతారామాలయంలో రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు ఉచితంగా అన్నదాన ప్రసాదాలను పంచిపెట్టారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని చిన్నమండెం బలిజపల్లెలోని శ్రీ రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని ఆలయ అర్చకులు చూడముచ్చటగా నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : మండలంలోని పలు గ్రామాలలోని రామాలయాల వద్ద సీతారాములకు పూజలు చేశారు. అలాగే గేటువద్ద ఉన్న రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని ఆలయ కమిటీ వారు కనుల పండువగా నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు. పలువురు దాతలు భక్తులకు పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయాలలో గురువారం ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి పెసరపప్పు, బెల్లం, పానకం ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి అనంతరం భక్తులకు పంచిపెట్టారు. అనంతరం సీతారాములకు ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను గురువారం భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ముందుగా ఆలయాలను పచ్చని తోరణాలు, విద్యుద్దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సీతారాముల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. సంబేపల్లె, దుద్యాల, దేవపట్ల, గుట్టపల్లె, గున్నికుంట్ల, పెద్దజంగంపల్లె తదితర గ్రామాలలోని శ్రీ రామాలయలలో వేదపండితులచే సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానంతో పాటు పానకం అందించారు.

వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని గురువారం వాడవాడలా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో సీతారాములు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామ నవమికి సాంప్రదాయబద్ధంగా పంపిణీ చేసే పానకం, వడపప్పును భక్తులకు అందించడంతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

చిట్వేలి : శ్రీరామ నవమి సందర్భంగా చిట్వేలి మండలంలో జై శ్రీరామ్ నామంతో దేవాలయాలు మార్మోగాయి. గురువారం మండలంలోని ప్రతి గ్రామంలోని దేవాలయాలు దీప కాంతులతో ముస్తాబు చేశారు. వేకువజాము నుంచి ఆలయాలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్వేలి సింగనమలలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పానకం, వడపప్పు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రాహ్మణ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి సీతారాముల చిత్రపటాన్ని చిట్వేలి పురవీధులలో మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించి రామనామాన్ని జపించారు



రాజంపేట టౌన్: కల్యాణం నిర్వహించిన దృశ్యం



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో సీతారాములు



లక్కిరెడ్డిపల్లె: కుర్నూతుల అగ్రహారంలో..



చిన్నమండెంలో వైభవంగా జరిగిన కల్యాణోత్సవం



వీరబల్లి: కల్యాణంలో ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ సీవీ నాగార్జున రెడ్డి



రాయచోటి టౌన్: కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



సంబేపల్లె: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మహిళలు



చిట్వేలి: సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం

ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి

రాయచోటి అర్బన్ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి సల్పాలని వైద్యులు బయారెడ్డి, మహేశ్వరరాజు, ఎస్ఐ మహమ్మద్ రఫీలు అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని చెక్‌పోస్టు దగ్గర, మదనపల్లె రోడ్డులోని పరీ క్లాసిక్ గ్రానైట్స్ వద్ద, గాలివీడు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద, కంసల వీధిలోని పాపులర్ షూ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన నాలుగు చలివేంద్రాలను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఆహారం తీసుకునే విధానాన్ని మార్చాలన్నారు. ఆయిల్ ఫుడ్స్‌కు దూరంగా ఉండి, ఎక్కువగా ఆకుకూరలను తీసుకోవాలన్నారు. కర్బూజా, పుచ్చకాయ, తాటిముంజలు వంటి సీజనల్ పండ్లతో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, దాతలు హరినాథరెడ్డి, శివారెడ్డి, హరీష్‌చంద్ర, నాగార్జునాచారి, అశోక్‌రెడ్డి, ఆర్.కె.కిషోర్‌లతో పాటు క్లబ్ జోన్ చైర్మన్ కుసుమాకర్, సభ్యులు రెడ్డిశేఖర్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సామాజిక సేవలో పోలీసులు భాగస్వామ్యం కావాలి

నందలూరు(రాజంపేట) : సామాజిక సేవలో పోలీసులు భాగస్వామ్యం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య అన్నారు. గురువారం ఆర్ఎస్‌రోడ్డులోని పోలీసుస్టేషన్ వద్ద నందలూరు ఏఎస్ఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ సూర్యనారాయణతో కలిసి సీఐ ప్రారంభించారు. హెడ్‌కానిస్టేబుల్ రహీం పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఉచిత మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అందులో భాగంగా పట్టణంలోని డివిజనల్ ఫారెస్టు కార్యాలయ సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులతోపాటు డీసీసీ బ్యాంక్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : పేదవారి ఆకలి విలువ తెలుసుకోవడమే రోజా ముఖ్య ఉద్దేశ్యమని వైఎస్సార్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలోని ఫాతిమా మసీదులో వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నమాజ్ ప్రార్థనలోను, ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఫయాజ్ బాషా, ఫయాజుర్ రెహామన్, కొలిమి ఛాన్ బాషా, ఫయాజ్ అహ్మద్, అన్నాసలీం, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, రియాజ్, నవరంగ్ నిస్సార్, అజ్మతుల్లా ఖాన్, కొత్తపల్లె ఇంతియాజ్, ఫిరోజ్ ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 3లక్షలతో మసీదు అభివృద్ధి

రాయచోటి పట్టణం మాసాపేటలోని షాహీ మసీదు అభివృద్ధి పనులకు రూ. 3 లక్షల నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మాసాపేట షాహీ మసీదును శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే శ్మశాన వాటిక రహదారి మరమ్మతులకు రూ. 1.5 లక్షల మున్సిపల్ నిధులను మంజూరు చేయిస్తామని చెప్పారు. లక్ష్మీ థియేటర్ ఎదురుగా ఉన్న ఫాతిమా మసీదుకు సంబంధించిన మదరసా స్థలాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

జూదరుల అరెస్ట్

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని వేర్వేరు ప్రాంతాలలో 11 మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రోడ్డులోని మాండవ్య నదిలోని ముళ్లపొదల్లో మంగతాయి ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,950లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఇందుకూరుపల్లె సమీపంలోని ముళ్ల పొదల్లో మరో నలుగురు మంగతాయి ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.87,180లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెడుతున్నట్లు తెలిపారు. ఈ దాడులలో అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, రామచంద్ర, జగన్నాథ్, మహేంద్ర నాయుడు, నాగేశ్వర నాయక్, పెంచలయ్య, సురేంద్ర, రాజులు పాల్గొన్నట్లు ఆయన తెలియజేశారు.

'పరిశుభ్ర పట్టణంగా రాజంపేట'



ప్రతిజ్ఞ చేసున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు

రాజంపేట : పరిశుభ్ర పట్టణంగా రాజంపేటను తీర్చిదిద్దుతున్నట్లు పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛ మార్షల్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, తడిచెత్త, పొడిచెత్తని వేరుచేయాలని సూచించారు. గార్బేజ్ ఫ్రీ సిటీ, పరిశుభ్రత అవగాహన కల్పించుకోవాలన్నారు. మన ఇంటిని –మన చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడిచెత్తని, పొడిచెత్తని వేరు చేసి పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, మానవహారం నిర్వహించారు. పురపాలక సంఘం వైస్ చైర్మన్ మర్రి రవి, కమిషనరు జనార్దన్‌రెడ్డి, ఆర్ఐ హరి, సచివాలయ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

వండాడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

చిన్నమండెం : వండాడి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చింతం ముసల్‌రెడ్డి అన్నారు. వండాడి దశాబ్దాలుగా శ్మశాన వాటిక లేక యర్రగట్లవాండ్లపల్లెకు చెందిన సుగాలీలు, రజకులు ఇబ్బందులు పడుతున్నారు. వీరి సమస్యను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన రెవెన్యూ అధికారులు శ్మశనవాటిక కోసం స్థలం కేటాయించారు. కేటాయించిన స్థలం చుట్టూ సర్పంచ్ ముసల్‌రెడ్డి తన సొంత నిధులతో కంచె వేయిస్తున్నారు. మరో కార్యక్రమంలో గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ముసల్‌రెడ్డి ప్రారంభించారు.

ప్రతి భక్తునికి ముత్యాల తలంబ్రాలు



ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు తయారు చేస్తున్న శ్రీవారి సేవకులు



అన్నదాన కేంద్రంలో భక్తులకు అన్నం వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, పెన్నా సిమెంట్ అధినేత

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి కల్యాణానికి తయారు చేస్తున్న ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు స్వామి వారి కల్యాణానికి వచ్చే ప్రతి ఒక్క భక్తునికి అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ముత్యాల తలంబ్రాల తయారు ప్రత్యేక డిప్యూటీ ఈఓ ప్రశాంతి అన్నారు. గురువారం ముత్యాల తలంబ్రాల తయారులో ఆమె పాల్గొని తలంబ్రాలను కలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది స్వామి వారి కల్యాణానికి మొత్తం ఒక లక్ష 75 వేల మంది భక్తులకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్నామని, వాటితో పాటు ముత్యాల తలంబ్రాలు ఇచ్చే బ్యాగులో పసుపు, కుంకుమ, కంకనాలు, ఒక వాటర్ బాటిల్ ఉంటాయని, అవే కాకుండా ఆ బ్యాగుల్లో రెండు శ్రీ వారి ప్రసాదపు లడ్డూలు ఉంటాయని తెలిపారు.

అన్నదాన కేంద్రాలు

బ్రహ్మోత్సవాల ప్రారంభమైనందున గురువారం పలు అన్నదాన కేంద్రాలు భక్తుల ఆకలిని తీర్చాయి. అందులో టూరిజం పోలీస్ స్టేషన్ వద్ద ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, కూడ్ల ఓబుల్ రెడ్డి కలిసి ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రం ఒక్కటి. ఈ అన్నదాన కేంద్రాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, పెన్నా సిమెంట్ అధినేత వేణుగోపాల్‌రెడ్డి కలిసి ప్రారంభించి, వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. అలానే మేడా విజయ శేఖర్‌రెడ్డి(పెద్దబాబు) అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టీటీడీ తరపున వీవీఐపీ వసతి గృహం ఎదురుగా ఉన్న నందనవనంలో అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

అలరించిన కవి సమ్మేళనం

కోదండ రామాలయం వద్ద నిర్వహించిన పోతన భాగవతం కవి సమ్మేళనం భక్తలను అలరించింది. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోతన సాహిత్య పీఠం కార్యదర్శి నారాయణరెడ్డి 'రుక్మిణీ సందేశం' వినిపించగా, డాక్టర్ బి. గోపాల్ కృష్ణ శాస్త్రీ 'శ్రీరామ జననం'ను వినిపించారు. ఇంకా డాక్టర్ కె. సుమన 'సీతారామ కల్యాణం', పి. శంకర్ 'భక్తరసం', వి. చిన్నయ్య 'కుచేలోపాఖ్యానం', ఎం.లోకనాథం 'శరణాగతి తత్వం' అంశాలపై ఉపన్యాసించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారి రాజగోపాల్ రావు, ప్రాజెక్టు అధికారి విజయ లక్ష్మి, ఏఈఓ శ్రీరాములు, ప్రోగ్రాం అసిస్టెంట్ రామాచారి తదితరులు పాల్గొన్నారు.